

# సంగమం

నర్సమ్మ పచ్చటి పసిమి. నుదుట పెద్ద కుంకం బొట్టు. కృష్ణ ఒడ్డున నుంచుని ముందుకు పరుగెత్తుతున్న కృష్ణమ్మని చూస్తోంది. ప్రియుణ్ణి కలుసుకోటానికి ఉరకలు తీస్తోంది కృష్ణమ్మ. మరి తన విభుడో?

నర్సమ్మకి పదేళ్ళ వయసులో అభం శుభం తెలియని సమయాన పెళ్ళయింది. పెళ్ళికొడుకు పేరు రామయ్య అని మాత్రమే తెలుసు నర్సమ్మకి. తనకి పన్నెండేళ్ళు వచ్చేసరికి తన భర్త దేశాంతరం వెళ్ళిపోయాడన్నారు. కొందరు కాశీకి వెళ్ళాడన్నారు. మరికొందరు గోసాయిల్లో కలిశాడన్నారు. ఆనాటి నుంచి భర్తకోసం ఎదురు చూస్తూనే ఉంది నర్సమ్మ. ఇప్పుడు నర్సమ్మ వయసు అరవై సంవత్సరాలు.

ముఖంనిండా పసుపు పట్టించుకుని కృష్ణలో మునిగింది. బిలబిల పరుగెత్తుతున్న కృష్ణమ్మని చూసి ఒక్కసారి నీళ్ళలో మునిగి 'తల్లీ! నువ్వు నేలంతా పరుచుకున్నావు గదా! నాసామి ఏ తావున్నాడో! ఆ కబురు చెప్పవా?' అని కృష్ణమ్మకి మాత్రమే రహస్యం చెబుతున్నట్టు నీళ్ళ అడుగున గొణిగింది.

భర్త లేకపోతేనేమి, నర్సమ్మ వూరంతకీ పెద్ద ముత్తయిదువ. ఎక్కడ తోరణం కట్టినా అక్కడ నర్సమ్మ ఉండవలసిందే. ప్రతి పేరంటంలోనూ మొదటి తాంబూలం ఆవిడకే. ఇక పెళ్ళివస్తే అన్నీ నర్సమ్మ చేతిమీంచి జరిగిపోవలసిందే.

దగ్గరుండి పెళ్ళికూతుర్ని చేయించేది. పెళ్ళికూతురికి నుదుట కళ్యాణ తిలకం దిద్దేది. చాదు చుక్క సరిజేసేది. మెడలోని ముత్యాల పేరులు చిక్కు విడదీసేది. చేయిపుచ్చుకు పెళ్ళిపీటలమీదికి నడిపించేది. మంగళసూత్రం కడుతూంటే జడ వొత్తిగించి పట్టుకునేది. మంగళహారతి పాడి ఆడబడుచు లాంఛనాల కోసం దెబ్బలాడేది. అప్పగింతలపాట పాడుతూ కన్నీరు మున్నీరై పోయేది.

బారసాలనాడు పొత్తిళ్ళలోని బిడ్డని బహు సుతారంగా అందుకునేది. బాలెంతరాలిచేత కృష్ణనించి నీళ్ళబిందె తెచ్చే సంబరంలో తనే ముందుండేది. జోలపాట తియ్యగా పాడేది. పసివాడి పట్టు పెదవుల్ని పదే పదే ముద్దాడేది. వాడు బోసిగా నవ్వితే తను గలగల నవ్వేది. పదిమందిని పగలూ రాత్రీ నవ్వించేది.

పెద్ద ముత్తయిదువు నర్సమ్మ!

కన్నె ముత్తయిదువు నర్సమ్మ!

సంక్రాంతి వస్తే కన్నెపిల్లలతో తనూ ముగ్గులువేపి ఆ ముగ్గులమధ్య గొబ్బెమ్మలు పెట్టి "మొగలి పూవువంటి మొగుణ్ణివ్వవే" అని వినీ విన్పించకుండా పాడి, సిగ్గుతో బుగ్గలు కందిపోగా ముడుచుకుపోతున్న నర్సమ్మను చూసి పెద్దలు చాటుగా కళ్ళొత్తుకునేవారు.

గుళ్ళోకి వెళ్ళి గంటకొడ్తే ఆగంట 'రామా' 'రామా' అన్నట్టు మోగితే నర్సమ్మ కళ్ళు చెమ్మగిల్లేవి. ఆ రామయ్య రూపు ఎలాగుండేదో కూడా నర్సమ్మకి తెలియదు. అయ్యకి మొక్కి అమ్మదగ్గరకెళ్ళి 'అమ్మా! అయ్యని విడిచి అరక్షణమైనా ఉండలేకనే కదా అయ్య తనువులో సగమైనావు. మరి నా సామి దగ్గరకు నన్ను చేర్చవా' అని గొణిగేది.

కార్తీకమాసం వస్తే అంత చలిలోనూ కార్తీక దీపాలకు వచ్చేది. తెల్లవారు జామునే స్నానం చేసి పూజచేసుకుని ఆవు నేతి దీపం వెలిగించి కృష్ణలో విడిచిపెడ్తూ "తల్లీ ఇది నా చేతుల్తో వెలిగించిన దివ్వె. ఆ కరిగిపోతున్న నెయ్యిలాగా, ఆ కాలిపోతున్న వొత్తిలాగా ఉన్నాను. అన్నీ దివ్వె తల్లికి చెప్పుకున్నాను. నా స్వామి

ఏ వాడనున్నా ఈ దీపాన్ని అక్కడికి చేర్చు తల్లీ. అన్నీ ఆ దీపమే చెపుతుంది" అంటూ దీపాన్ని జాలులో విడిచిపెట్టేది. ఆ దీపం మిణుకుమిణుకుమంటూ అటూ ఇటూ వూగుతూ ప్రవాహంలో కొట్టుకుపోతుంటే, 'తప్పకుండా స్వామికి నా కబురు అందుతుంది' అనుకుంటూ వొడ్డుకొచ్చేది.

ఎన్ని పూజలు చేసినా, ఎన్ని కమ్మలంపినా స్వామి రాలేదు. యాభై ఏళ్ళు పిలిచింది. అన్ని రాత్రులు మేల్కొని నిరీక్షించింది. స్వామి రాలేదు. ఆ రోజు మాఘపౌర్ణమి. అమరావతి వెన్నెలమయమైంది. పండువెన్నెల పగలబడి కురుస్తోంది. నర్సమ్మ కృష్ణ వొడ్డుకొచ్చి నుంచుంది. కృష్ణమ్మ వెన్నెట్లో పొంగి పొంగి పారుతోంది. వెన్నెల రాత్రి ప్రియుణ్ణి కలుసుకోటానికి అలంకరించుకుని వెళ్తున్నట్లుంది కృష్ణ. నల్లటి కృష్ణమ్మ వెన్నెట్లో తెల్ల జరీచీర కట్టుకున్నట్లుంది.

కంఠాన అలంకరించుకున్న మణిమాలలా కృష్ణలో నక్షత్రాలు ప్రతిఫలిస్తున్నాయి. విరిగిపడుతున్న అలలకి వెన్నెల ముక్కలవుతుంటే కృష్ణమ్మ సిగ్గుతో ముసిముసినవ్వులు నవ్వుతున్నట్లుంది. ప్రవాహంలో నురగలు, నిడివైన కృష్ణమ్మ పూలజడలో కూర్చిన మల్లెగుత్తుల్లా ఉన్నాయి. కృష్ణమ్మ ప్రియుడి దగ్గరకి వెళ్తోంది. మంద మందంగా నడుస్తూ, పొంగి పొంగి నవ్వుతూ .....

నర్సమ్మ కళ్ళలో ధారలు ధారలుగా కన్నీళ్ళు. "తల్లీ నువ్వు రోజూ నీ స్వామి దగ్గరకెళ్తావు .... ఒక్కసారి.... ఒక్కసారి .... నా స్వామిని నాకు చూపించవా .... ఒక్కసారి...."

కృష్ణమ్మ "రా .... నాతో రా ......" అన్నట్టు ముందుకు సాగిపోతోంది.

ఆ పిలుపుకి అరవై ఏళ్ళ నర్సమ్మ పదహారేళ్ళ కన్నెపిల్లయి పోగా వొళ్ళు జలదరించింది. కళ్ళు తుడుచుకుంది. తనలో తనే నవ్వుకుంది. "వస్తున్నా తల్లీ.... వస్తున్నా" అంటూ భర్తని సమీపించే సిగ్గుతో నేల చూసుకుంటూ, పవిట నిండుగా కప్పుకొని మెల్ల మెల్లగా నడిచి కృష్ణలోకి దిగింది.

కృష్ణమ్మ తప్పకుండా ప్రియుణ్ణి కలుసుకుంది.

నర్సమ్మ సంగతి నాకు తెలియదు.*